క్లుప్తంగా

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



పతకాలతో విద్యార్థులు

కోరుట్లటౌన్: పట్టణంలోని గ్రీన్‌వుడ్ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు జాతీయస్థాయి కరాటే పోటీల్లో 2 గోల్డ్, 2 సిల్వర్, 1 బ్రాంజ్ మెడల్ సాధించినట్లు కరస్పాండెంట్ అబ్దుల్ మోయిజ్, ప్రిన్సిపాల్ ఉమేరియా సుల్తానా సోమవారం తెలిపారు. నర్సంపేటలో ఆదివారం జాతీయస్థాయి కరాటే పోటీలు నిర్వహించగా కటాస్ విభాగంలో అబ్దుల్ ముజిత్, అబ్దుల్ ముఖ్‌షిత్‌లకు గోల్డ్‌మెడల్స్, వినయ్‌కుమార్, ఉషేద్ అలీఖాన్‌లకు సిల్వర్‌మెడల్స్, షైమా వెహరిన్‌కు బ్రాంజ్ మెడల్ సాధించారన్నారు.

బస్తీ దవాఖానా పనులు వారంలో పూర్తి చేయాలి



పనులు పరిశీలిస్తున్న కమిషనర్

రాయికల్: పట్టణంలో చేపట్టిన బస్తీ దవాఖానా పనులను వారంలోపు పూర్తిచేయాలని మున్సిపల్ కమిషనర్ సంతోష్‌కుమార్ అన్నారు. సోమవారం పనులను పరిశీలించి మాట్లాడారు. వారం రోజుల్లోపు పనులు పూర్తిచేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. పంచాయతీరాజ్ ఏఈ ప్రసాద్ వెంట ఉన్నారు.

జగిత్యాల ఎంపీడీవోగా శైలజ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీవో శైలజ

జగిత్యాలరూరల్: జగిత్యాల ఎంపీడీవోగా శైలజ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జగిత్యాల ఎంపీడీవోగా పనిచేసిన స్వరూపరాణి ఉద్యోగ విరమణ పొందగా మల్యాల ఎంపీడీవోగా పనిచేస్తున్న శైలజను జగిత్యాల ఎంపీడీవోగా బదిలీచేయగా బాధ్యతలు స్వీకరించారు.

మల్యాల ఎంపీడీవో బదిలీ

మల్యాల: ఎంపీడీవోగా శైలజారాణి బదిలీపై జగిత్యాల అర్బన్ మండలానికి వెళ్లారు. 2020 జూలై 31న సుధాకర్ ఉద్యోగవిరమణ పొందగా, ఆగస్టు 1 నుంచి మల్యాల ఎంపీడీవోగా శైలజారాణి విధులు నిర్వహించారు. ఎంపీఓ వాసవికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

పరిశోధన స్థానం సందర్శన



జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానాన్ని జిల్లా కేంద్రంలోని సువిద్య హైస్కూల్ విద్యార్థులు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పరిశోధనస్థానం శాస్త్రవేత్తలు తాము సాగుచేసిన పంటలు, వాతావరణ పరిశోధన స్థానం తీరుతెన్నులు వివరించారు.

విద్యావ్యవస్థను బలోపేతం చేయాలి



మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న సర్పంచ్

సారంగాపూర్: విద్యావ్యవస్థను బలోపేతం చేయాల్సింది ప్రాథమిక విద్యనుంచేనని సర్పంచ్ లక్ష్మి అన్నారు. సోమవారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె పరిశీలించారు. చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు, ఉత్తమ విద్యనందించాలన్నారు. గర్భిణులకు పోషక విలువలు కలిగిన ఆహారం నిబంధనల ప్రకారం అందించాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెంచాలని నిర్ణయించారు.

రూ.27లక్షలతో అభివృద్ధి పనులకు ప్రణాళిక

కథలాపూర్: మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సీఎఫ్‌సీ నిధులు రూ.27 లక్షలతో అభివృద్ధి పనులకు ప్రణాళిక రూపొందించినట్లు ఎంపీపీ జవ్వాజి రేవతి తెలిపారు. సోమవారం కథలాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీటీసీలు,మండలాధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. పాఠశాలల్లో అభివృద్ధి పనులకు రూ.10 లక్షలు, డ్రెయినేజీల నిర్మాణానికి రూ.16లక్షలు, ఇతర పనులకు రూ. లక్ష వెచ్చించాలన్నారు. ఎంపీడీవో జనార్దన్, ఏఈ ఆదిత్య, ఎంఈవో ఆనందరావు పాల్గొన్నారు.

గుంతలు బాబోయ్ గుంతలు

- అధికారుల నిర్లక్ష్యమా లేక శాఖల మధ్య సమన్వయ లోపమా?
- సూచిక బోర్డులు లేకుండా తవ్వివదిలేసిన టీ ఫైబర్ గ్రిడ్ గుంతలు
- పట్టించుకోని అధికారులు
- చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు



పూడ్చకుండా వదిలేసిన టీ ఫైబర్ గ్రిడ్ గుంత



గ్రామపంచాయతీకి వెళ్లేదారిలో ప్రమాదకర గుంత

అధికారుల నిర్లక్ష్యమో లేక శాఖల మధ్య సమన్వయ లోపామో ఓ నిండు ప్రాణం బలైంది. అధికారులున్నా తమకేమి పట్టనట్లుగా వ్యవహరించడం, కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా గుంతలు తవ్వి పూడ్చకుండా వదిలేసి వెళ్లడంతో పాటు సూచికబోర్డులు ఏర్పాటుచేయక పోవడంతో చీకట్లో ప్రయాణికులకు గుంతలు కానరాక ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోతున్నారు. దీనికి సంబంధించి ఎవరినీ అడగాలో తెలియక స్థానికులు తికమక పడుతున్నారు. అన్ని తెలిసినా అధికారులే తమకు సంబంధం లేదంటూ చేతులెత్తేస్తుండడంతో అయోమయం నెలకొంటుంది.

వెల్గటూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ గ్రామానికి ఇంటర్నెట్ సేవలు విస్తరించాలనే లక్ష్యంతో టీ ఫైబర్ నెట్ సేవలు అందిస్తోంది. ఇంతవరకు బాగానే ఉన్నా పైపులు వేసేందుకు రోడ్లవెంట తీసిన గుంతలను, పనులు పూర్తయిన వెంటనే పూడ్చకుండా అలాగే నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు. దీంతో రోడ్లపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది.

గుంతలతో నిత్యం ప్రమాదాలు...

ఫైబర్ గ్రిడ్ కోసం తవ్విన గుంతను పూడ్చకుండా వదిలేయడంతో గత శనివారం రాత్రి వెల్గటూర్ మండలం నూతన రైస్‌మిల్ సమీపంలో జగదేవుపేటకు చెందిన ఆటో చీకట్లో మట్టి కుప్పపైకి ఎక్కింది. దీంతో ఆటో అదుపుతప్పి బోర్లాపడి పల్టీలు కొడుతూ ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ ఘటనలో జగదేవుపేటకు చెందిన క్యాతం చంద్రమౌళి మృతిచెందగా చెన్న అర్చన చేయి విరిగింది అసలే మధ్యతరగతి కుటుంబం ఇంటిపెద్దను కోల్పోవడంతో రోడ్డున పడ్డారు. గతంలో కూడా ఇలాంటి ప్రమాదాలు జరిగినా ఇప్పటి వరకు అధికారులు ఈ సమస్యపై దృష్టిసారించకపోవడం గమనార్హం. ఈ ఘటనలో అధికారుల నిర్లక్ష్యానికి ఒక నిండు ప్రాణం బలైంది.

పనులపై పర్యవేక్షణ కరువు...

వెల్గటూర్ నుంచి కుమ్మరిపల్లి వెళ్లే జగిత్యాల రహదారికి ఆనుకొని మండలకేంద్రం పరిధిలో ఇలాంటి గుంతలు సుమారు 20కి పైగా ఉన్నాయి. ఫైబర్ గ్రిడ్ కేబుల్ కనెక్షన్ల కోసం జేసీబీల సాయంతో రహదారుల వెంట ఇష్టానుసారం పెద్దపెద్ద గుంతలు తవ్వారు. కనీసం గుంతలు ఉన్నచోట సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. కాంట్రాక్టర్లకు అక్కడ జరుగుతున్న పనులపై పర్యవేక్షన లేకపోవడంతో గుంతలను పూడ్చకుండా అలాగే వదిలేస్తున్నారు.

శాఖల మధ్య సమన్వయ లోపం..

ఫైబర్ గ్రిడ్ పనుల కోసం ప్రభుత్వం నుంచి కాంట్రాక్ట్ పొందిన వారు కందకాలు తవ్వేందుకు స్థానిక అధికారుల నుంచి అనుమతులు తీసుకొని, కందకాలు తవ్వే సమయంలో జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. పనులు పూర్తయిన వెంటనే గుంతలు పూడ్చివేయాల్సి ఉంటుంది. కానీ కాంట్రాక్టర్లు గుంతలు పూడ్చకుండానే వదిలేస్తున్నారు. దీనిపై స్థానిక అధికారులను వివరణ కోరగా ఈ నిర్లక్ష్యానికి పూర్తి బాధ్యత కేవలం ఆ కాంట్రాక్టర్లదేనని వీటితో తమకు సంబంధం లేదని అంటున్నారు. సంబంధిత శాఖల మధ్య సమన్వయ లోపం ప్రజల పాలిట శాపంగా మారింది. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో ప్రమాదాలు

ప్రతీ పల్లెకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలన్న ప్ర భుత్వ లక్ష్యం ఈ అధికారుల నిర్లక్ష్యం మూలంగా నీ రుగారి పోతోంది. ఈ గుంతలు పూడ్చడంలో అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ కారణంగా ప్రజల ప్రాణాలు పోతున్నా అధికారుల్లో చలనం రాకపోవడం బాధాకరం.

– గోపతి జనార్దన్, పాశిగామ, గ్రామస్తుడు

చర్యలు తీసుకోవాలి

గుంతలు తీసి వదిలేయడంతో నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఇందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి. అధికారులు వారి విధులపై శ్రద్ధ వహించకపోవడంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి గుంతలు పూడ్చివేయించాలి.

– గుంత సంతోశ్, స్థానికుడు

ప్రమాదాలు జరగకుండా చూడాలి

ఫైబర్ గ్రిడ్ పనుల కోసం గుంతలు తీసి పూడ్చకుండా వదిలేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి. గుంతలు పూడ్చివేసి మరోసారి ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలి. గుంతలు ఉన్న చోట ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటుచేయించాలి.

– గుమ్ముల సతీశ్, స్థానికుడు

రైతులు ఆయిల్‌పామ్ సాగుచేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ జాజాల భీమేశ్వరి

ఇబ్రహీంపట్నం: రైతులు ఆయిల్‌పామ్ పంటలు సాగుచేసేందుకు ముందుకు రావాలని ఎంపీపీ జాజాల భీమేశ్వరీ కోరారు. సోమవారం మండలంలోని ఎర్దండిలో ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న ఆయిల్ పామ్ మొక్కలను బట్టు రమేశ్ రైతు పొలంలో 137 ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. ఉపసర్పంచు బట్టు రాజశేఖర్, ఉద్యానవన అధికారి రమేశ్, పంచాయతీ కార్యదర్శి మనోజ్, నాయకులు గంగాధర్, గణేశ్, కారోబార్ రత్నం, రైతులు పాల్గొన్నారు.

బ్రిడ్జి పనులు త్వరగా పూర్తిచేయాలి

కొమటికొండాపూర్ నుంచి ఎర్దండి వెళ్లే దారిలో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతున్నాయని త్వరగా పూర్తిచేయాలని ఎంపీపీ సూచించారు. కోమటికొండాపూర్, ఎర్దండి గ్రామాల మధ్య రూ. 2 కోట్లతో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు పరిశీలించారు. వచ్చే జూన్ నాటికి పనులు పూర్తిచేయాలని లేకుంటే భారీ వర్షాలకు, వరదలకు రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉందని రైతులు, వాహనదారులు ఇబ్బందులు పడతారని కాంట్రాక్టర్‌కు సూచించారు. రాజు జాజాల జగన్‌రావు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి

ఇబ్రహీంపట్నం మండలంలోని మనఊరు మనబడి పనులు వేగవంతం చేయాలని ఎంపీపీ జాజాల భీమేశ్వరి అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో మన ఊరు మన బడి పనులపై అధికారులతో సమావేశం నిర్వహించారు. పనులు నత్తనడకన సాగుతున్నాయని త్వరగా పనులు పూర్తిచేయాలని సూచించారు. ఎంపీడీవో ప్రభు, ఆర్‌అండ్‌బీ ఏఈ వేణు, ఈసీ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

వెన్నుమట్లలో 'కంటివెలుగు'

గొల్లపల్లి: మండలంలోని వెన్నుమట్ల గ్రామంలో 'కంటివెలుగు' కార్యక్రమాన్ని ఎంపీపీ నక్కశంకర్ ప్రారంభించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ లక్ష్మి, ఎంపీవో సురేశ్‌రెడ్డి, కార్యదర్శి వెంకటేశ్, వార్డు సభ్యులు వైద్యులు,ఆశావర్కర్లు,అంగన్‌వాడీలుఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామంలో సీఎం సహాయనిధిలో మంజూరైను చెక్కులను సర్పంచ్ గుడిసె శ్రీమతి సోమవారం పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సహకారంతో చెక్కులు మంజూరైనట్లు ఆమె వెల్లడించారు. ఎంపీటీసీ ఆడెపు మల్లీశ్వరి, ఉపసర్పంచ్ రమేశ్, మండల కోఆప్షన్ సభ్యురాలు ఎండి.బీబా వెంట ఉన్నారు.

కాలనీపేరు మార్చొద్దని వినతి

మెట్‌పల్లి: పట్టణంలోని 6వ వార్డులోని బీడీ వర్కర్స్ కాలనీ పేరు మార్చొద్దని స్థానికులు పలువురు సోమవారం ఆర్డీవో కార్యాలయం అధికారులకు వినతి పత్రం అందించారు చెన్నమనేని విద్యాసాగర్‌రావు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఈ కాలనీని ఏర్పాటు చేశారని దీనిని అదే పేరుతో కొనసాగించాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో హమీద్, ఖలీమ్, హుస్సేన్, సాజిద్, అదిల్, రషీద్ ఉన్నారు.

నిరుద్యోగ భృతికి నిధులేవి?

మెట్‌పల్లి: బడ్జెట్‌లో నిరుద్యోగ భృతికి నిధులు కేటాయించకపోవడం సరికాదని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దొనికెల నవీన్ సోమవారం పేర్కొన్నారు. గత ఎన్నికల్లో నిరుద్యోగ భృతిలో అర్హులైన వారికి నెలకు రూ.3,016 చెల్లిస్తామని బీఆర్‌ఎస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. కానీ ఇంతవరకు దానిని అమలు చేయలేదన్నారు. వచ్చేఎన్నికల్లో మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో ఆర్థికాభివృద్ధి

రాయికల్: ఆయిల్‌పామ్ సాగుతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి అన్నారు. రాయికల్ మండలం భూపతిపూర్‌లో ఆయిల్‌పామ్ ప్లాంటేషన్‌లో భాగంగా రైతు లక్ష్మారెడ్డికి చెందిన ఆయిల్‌ఫామ్ తోటలో మొక్కలు నాటారు. అనంతరం గ్రామంలో చేపడుతున్న మన ఊరు మన బడి పనులను పరిశీలించారు. వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రావు, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు మోహన్‌రావు, ఒడ్డెలింగాపూర్ సర్పంచ్ పాలకుర్తి రవి, డివిజన్ అధికారి స్పందన, మండల అధికారి భూక్య రాజేశ్ పాల్గొన్నారు.

నానో యూరియాపై దృష్టిసారించాలి



అవగాహన కల్పిస్తున్న ఇఫ్కో మేనేజర్ శ్రీధర్

ధర్మపురి: ఇఫ్కో కంపెనీ ఆధ్వర్యంలో తయారు చేసిన నానో యూరియా వాడకంపై రైతులు దృష్టి సారించాలని ఇఫ్కో మేనేజర్ శ్రీధర్ సూచించారు. ధర్మపురి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నేరెల్లలో సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం మేనేజర్ మాట్లాడుతూ.. గతంలో గుళికల రూపంలో ఉన్న యూరియా వాడకంతో భూమిలో సారం తగ్గి సమస్యాత్మక నేలలుగా మారేవని వీటి పరిష్కారానికి ఇఫ్కో సంస్థ తయారుచేసిన నానో యూరియా లిక్విడ్‌తో అధిక లాభాలు పొందవచ్చన్నారు. నానో యూరియా వాడకం విధి విధానాలు, వాటి ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ పలిగిరి వసుందర, ఉపసర్పంచ్ జాజాల శంకర్, సహకార సంఘం జాజాల లక్ష్మి, రైతుసంఘం అధ్యక్షుడు జాజాల రమేశ్, ఇఫ్కో కంపెనీ ఎస్.ఎఫ్.ఏ నవీన్ తదితరులున్నారు.

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కొడిమ్యాల: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరిపంటకు మొగిపురుగు, జింకు లోపాన్ని గుర్తించామని రైతులు వాటి నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో పి.జ్యోతి సూచించారు. సోమవారం మండలంలోని కొండాపూర్, గోపాలరావుపేట, శనివారంపేట గ్రామాల్లో పంటపొలాలను పరిశీలించారు. రైతులకు తెగుళ్ల నివారణ యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. శనివారంపేట సర్పంచ్ బందరు ఎల్లవ్వ, కొండాపూర్ ఉపసర్పంచ్ కొలపురం రమేశ్, ఏఈఓలు మంజుల, శ్రీలత, గ్రీష్మ రైతులు రాజిరెడ్డి, రఘుపతిరెడ్డి, శేఖర్, మనోహర్‌రెడ్డి, రమేశ్, వెంకటి పాల్గొన్నారు.

మల్లాపూర్: ప్రతికూల వాతావరణ పరిస్థితులతో రైతులు పండిస్తున్న యాసంగి వరిలో సమస్యలు తలెత్తుతున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి పాక సురేష్‌కుమార్ తెలియజేశారు. యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలను వివరించారు.

రోళ్లవాగు ప్రాజెక్టు ఎగువ గ్రామాలకు సాగు నీరందించాలి

- పనులు త్వరగా పూర్తిచేయాలి
- బీర్‌పూర్ మండల సభలో సభ్యుల వాదన



మాట్లాడుతున్న ఎంపీపీ రమేశ్

సారంగాపూర్: రోళ్లవాగు ప్రాజెక్టు ఎగువ ప్రాంత గ్రామాలకు సాగునీరందించే పనులు త్వరగా పూర్తి చేయాలని సభ్యులు అధికారులకు విజ్ఞప్తిచేశారు. సోమవారం బీర్‌పూర్ మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మసర్తి రమేశ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పలు సమస్యలు లేవనెత్తారు. రోళ్లవాగు ప్రాజెక్టు ఎగువగ్రామాలు చెర్లపల్లి, రఖ్వా, కండ్లపల్లి, రంగసాగర్, మంగేళ గ్రామాలకు 15 రోజులుగా సాగునీరందక పొలాలు ఎండుతున్నాయని, ఫీడర్‌ఛానల్ పనులు చేపట్టే క్రమంలో కాలువలో అడ్డుగావచ్చిన బండరాళ్లను తొలగించి నీరందించేలా చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, మిషన్‌భగీరథ పనులు పూర్తిచేయాలని ఎన్నిసార్లు కోరినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. రేకులపల్లి గ్రామ చెరువులోకి నీరురాకుండా తూములో బండలు అడ్డుగా పెట్టారని పేర్కొన్నారు.ఉపాధికోసం గల్ఫ్ దేశాలకు వెళ్లినవారి పేర్లను రేషన్‌కార్డులో నుంచి తొలగించడం ఎంతవరకు సమంజసం అన్నారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులకు అటవీశాఖ అధికారులు ఆటంకం కలిగిస్తున్నారని ఆరోపించారు. పింఛన్‌ల మంజూరులో అర్హులైనవారు దరఖాస్తు చేసుకుంటే మరుసటి నెలలో పింఛన్ అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీపీ మసర్తి రమేశ్ మాట్లాడుతూ.. అధికారులు, సభ్యులు సభలో తీసుకువచ్చిన సమస్యల పరిష్కారానికి గ్రామస్థాయిలో పర్యటించి సత్వర నిర్ణయం తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో మల్లారెడ్డి, డెప్యూటీ తహసీల్దార్ విష్ణు, వైస్‌ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, ఎంపీటీసీ సభ్యులు రంగు లక్ష్మణ్, ఆడెపు మల్లీశ్వరి, కోఆప్షన్ సభ్యురాలు బీబా, సర్పంచ్‌లు నల్లమహిపాల్‌రెడ్డి, ఎనగందుల లక్ష్మి, చుంచు శారద, బందెల మరియ, మేసు ఏసుదాసు, పర్వతం రమేశ్, సీపతి రమేశ్, అజ్మీరా ప్రభాకర్, అధికారులు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన



వినతిపత్రం ఇస్తున్న గంగపుత్రులు

మెట్‌పల్లి: శిఖం భూములను పరిరక్షించాలని కోరుతూ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట సోమవారం చిట్టాపూర్, ధర్మారం, వేంపేటకు చెందిన గంగపుత్రులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. చిట్టాపూర్‌లో పెద్దచెరువుతో పాటు కుంటలను కబ్జాచేస్తున్నారని, దీంతో తమ ఉపాధి దెబ్బతినే ప్రమాదముందన్నారు. అధికారులు సర్వేచేసి కబ్జాకు గురైన స్థలాలను స్వాధీనం చేసుకుని రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పల్లికొండ ప్రవీణ్, కల్లెడ గంగాధర్ తదితరులున్నారు.

సహచరుడి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం చేస్తున్న సభ్యులు

మల్లాపూర్: మండలంలోని రేగుంటకు చెందిన ఆల్‌యూత్ అసోసియేషన్ – స్పోర్ట్స్ క్లబ్ సభ్యుడు దూడ రాజు(28)ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, అసోసియేషన్ సభ్యులు బాధితుడి కుటుంబానికి అండగా నిలిచారు. సోమవారం సహచరుడి కుటుంబాన్ని పరామర్శించి రాజు భార్య పూజకు రూ. 90 వేలు ఆర్థికసాయంచేశారు. భవిష్యత్‌లో పిల్లల చదువులకి, ఇతర అవసరాలకు బాసటగా నిలుస్తామని హామీ ఇచ్చారు. దాతలు ముందుకు వచ్చి రాజు కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రేగుంట ఆల్‌యూత్ అసోసియేషన్ – స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు గనవేని మల్లేశ్‌యాదవ్, ఉపాధ్యక్షుడు బందెల నరేశ్, కోశాధికారి వేములవాడ దేవరాజం ఆర్గనైజర్ మోతే రమేశ్, కార్యదర్శి కుందేల్ల రాజేశ్, సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ రాజశేఖర రాజు

కోరుట్లరూరల్: విద్యార్థులు సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సీఐ రాజశేఖర రాజు అన్నారు. మండలంలోని కల్లూరు శివారులోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో సైబర్ క్రైంతో పాటు వ్యక్తిత్వ వికాసం, వివిధ రకాల మోసాలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ అంజయ్య, ఎంపీటీసీ చిట్నేని లత, పాఠశాల ఇన్‌చార్జి శిరీష, తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే

జగిత్యాలక్రైం: మద్యంతాగి వాహనాలు నడిపితే జైలుశిక్ష తప్పదని జగిత్యాల ట్రాఫిక్ ఎస్సై రాము అన్నారు. ఇటీవల డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 97 మందిని కోర్టులో హాజరుపర్చగా సోమవారం వారికి న్యాయమూర్తి రూ.1,01000 జరిమానా విధించారు. అనంతరం వీరికి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు.

సెల్‌ఫోన్ వినియోగం తగ్గించాలి

కథలాపూర్: విద్యార్థులు సెల్‌ఫోన్ వినియోగం తగ్గించాలని కథలాపూర్ ఎస్సై రాంచంద్రం అన్నారు. సోమవారం కథలాపూర్ మండలం సిరికొండ జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. బ్యాంక్ ఖాతా వివరాలు, ఓటీపీలు ఇతరులకు చెప్పవద్దన్నారు. అపరిచితులు కాల్‌చేస్తే స్పందించవద్దని, వ్యక్తిగత వివరాలు చెప్పవద్దన్నారు. సమావేశంలో హెచ్‌ఎం ఆకుల లక్ష్మినర్సయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

'చలో హైదరాబాద్' విజయవంతం చేయాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న కార్మికులు

కోరుట్ల: మధ్యాహ్న భోజనం కార్మికులు సమస్యల పరిష్కారానికి ఈనెల 8న ఇందిరాపార్క్‌లో నిర్వహించే ధర్నాకు తరలిరావాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు కోరారు. ఈ మేరకు సోమవారం సీ.ప్రభాకర్ భవన్‌లో 'చలో హైదరాబాద్'కరపత్రాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం మిడ్‌డే మిల్స్ కార్మికుల వేతనాలను రూ.వెయ్యి నుంచి రూ.3వేలు పెంచుతూ జీవో జారీచేసినా గతేడాది మార్చి నుంచి ఇప్పటికీ పెంచిన వేతనాలు ఇవ్వలేదన్నారు. చలో హైదరాబాద్ కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మునుగూరి హన్మంతు,చెన్నవేణి దశరథం,ఎండీ. ఉస్మాన్, రజియా, పద్మ, పరమేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్ ధర్నా



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

మెట్‌పల్లి: కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మపురి ఆలయకమిటీ మాజీ అధ్యక్షుడు జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ.. ఎల్ఐసీకి చెందిన రూ. 77వేల కోట్లను షేర్ల రూపంలో తీసుకున్న అదానీ కంపెనీలు ప్రస్తుతం దివాళా తీస్తుండడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రధాని మోదీ మద్దతుతోనే ఇది జరిగిందని, ఆయన చర్యలు దేశ ఆర్థికరంగాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని విమర్శించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం, మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి నాయకులు బెజ్జారపు శ్రీనివాస్, హాఫీజ్, అందె మారుతి, పుల్లా రాజాగౌడ్, రాజు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర

కథలాపూర్: మండలకేంద్రంలో సోమవారం కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర చేపట్టారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్‌సే హాథ్ జోడో యాత్రకు మద్దతుగా పాదయాత్ర నిర్వహించినట్లు పేర్కొన్నారు. కరెంట్ కోతలతో, ప్రాజెక్టుల నుంచి కాలువల ద్వారా నీళ్లురాక పంటలు ఎండిపోతున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్, బీజేపీ ప్రభుత్వాల వైఫల్యాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ.అజీమ్, నాయకులు హరిప్రసాద్, తొట్ల అంజయ్య, ధనుంజయ్‌రెడ్డి, లింగంగౌడ్, పంబాల శంకర్, మోయిన్ పాల్గొన్నారు.

కులసంఘం భవనాలకు ప్రత్యేక నిధులు



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ శంకర్

గొల్లపల్లి: కులసంఘం భవనాలకు ప్రభుత్వం ప్రత్యే క నిధులు కేటాయిస్తోందని ఎంపీపీ నక్కశంకర్ అ న్నారు. మండలంలోని అగ్గిమల్ల గ్రామంలో రూ.5 లక్షలతో కుర్మసంఘం భవనానికి సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం కుల సంఘాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తోందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆవుల సత్యం, మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మండ్లు, యాద వ సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మిరాజం, సర్పంచ్ కొక్కు అంజి, బీఆర్‌ఎస్ నాయకులు కొత్త నారాయణ యాదవ సంఘం నాయకులు తోకల కొమురయ్య, బండ కొమురయ్య, చంద్రయ్య, మారం శంకరయ్య, సందవేణి మల్లేశ్, బండి ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలు వివరించాలి

జగిత్యాలరూరల్: బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషిచేయాలని జగిత్యాల రూరల్ మండలం బీజేపీ ఇన్‌చార్జి డాక్టర్ ఎడ్మల శైలేందర్‌రెడ్డి అన్నారు. పెర్కపల్లిలోని భాగ్యరాజ్ ఫంక్షన్‌హాల్‌లో నలువాల తిరుపతి అధ్యక్షతన సమావేశం నిర్వహించి మాట్లాడారు.